# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-3, సంచిక-7 15 ఆగస్టు- 2016 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## చలో వారణాసి - రైతు వృత్తికారుల మహాసమ్మేళనం జయప్రదం చేయండి

16-10-2016న భైంసాసుర ఘాట్, గంగానది ఒడ్డున వారణాసిలో రైతుల, వివిధ వృత్తిదారుల మహాసమ్మేళనం మధ్యాహ్నం 12 గం॥లకు ప్రారంభం - అన్ని రాష్ట్రాల నుండి రైతుల, వివిధ వృత్తిదారుల సంఘాల నుండి ప్రతినిధులతోపాటు సభ్యులు కలిసి ప్రస్తుత భారతదేశ ఆర్థిక అభివృద్ధి నమూనాలో తామంతా ఎలా నష్టపోతున్నామో చర్చించి వస్తు సేవల ఉత్పత్తి కోసం కావల్సిన జ్ఞానం తమ వద్దవుందని దీనిద్వారానే భారతదేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతోందనీ విశ్వవిద్యాలయాల్లో నేర్పే జ్ఞానం కన్నా తమ జ్ఞానం ఏ మాత్రం తక్కువ కాదనీ ప్రభుత్వోద్యోగులవలే తమకందరికీ శాశ్వత ఉద్యోగం తమ యొక్క లోకవిద్య ఆధారిత పనికోసం సృష్టించి ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలివ్వడం ద్వారానే ప్రస్తుత సమాజంలో దోపిడీ ఆగుతుందనీ ప్రకటించటానికి ఉద్యమిస్తున్నారు. ఈ ఏర్పాట్లన్నీ లోకవిద్యాజనాందోళన, భారతీయ కిసాన్ యూనియన్ మరియు వివిధ మిత్రులు నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీలతో పాటు ఇతర ప్రాంతాల్నుంచి కూడా ఈ సమ్మేళనంలో పాల్గొనడానికి ప్రతినిధులు రావడానికి అంగీకరించారు. ఈ సమ్మేళనం సందర్భంగా 3 కరపత్రాలు హిందీలోనూ, ఇంగ్లీషులో ఒక పుస్తకం, ఒక కరపత్రం, తెలుగులో అందరికి ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలనే పేరుతో పుస్తకం "ప్రపంచీకరణకు సమాధానం స్థానిక ఉత్పత్తి వినియోగాలే'' తోపాటు లోకవిద్యాప్రపంచం పత్రిక ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతోంది.

ఈ పుస్తకాలు, కరప్రతాలు చూడడానికి ఈ క్రింది వెబ్‌సైట్‌లు అంతర్జాలంలో చూడగలరు.

http : //vidyaashram.org/papers/kkm-parcha-2.pdf
http : //vidyaashram.org/papers/kkm-parcha
http : //www.vidyaashram.org/lokavidyaprapancham.html
http: //vidyaashram.org/papers/lja-anouncement_telugu.pdf.

### విన్నపం

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాలలో వున్న లోకవిద్యాప్రపంచం పత్రికచదివే మిత్రులు, వివిధ రైతు సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు, సాంకేతిక నిపుణులు మరియు ఎవరైతే లోకవిద్య ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని విశ్వసించేవారున్నారో వారూ దేశభవిష్యత్ గ్రామాల భవిష్యత్ కాంక్షించేవారంతా ఈ సమ్మేళనం నిర్మాణంలో తమ పాత్రను భౌతికంగా, మానసికంగా సంపూర్ణ మద్దతు అందచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వివరాల కోసం ఈ క్రింది వారి నెవరినైనా సంప్రదించగలరు.

1. దిలీప్‌కుమార్ డిలి - లోకవిద్యాజనాందోళన, వారణాసి (+91-9452824380)
2. శ్రీమతి ప్రేమ్‌లతాసింగ్, కారిగర్‌నజరియా, వృత్తికారుల ఉద్యమాలు పత్రిక సంపాదకురాలు వారణాసి (+91-93691249998)
3. లక్ష్మణ్ ప్రసాద్, భారతీయ కిసాన్ యూనియన్, వారణాసి శాఖ అధ్యక్షులు (+91-9026219913)
4. డా.బి. క్రిష్ణరాజులు, హబ్సిగూడ, హైదరాబాద్ (+91-9866139091)
5. మాచర్ల మోహన్‌రావ్, చీరాల, ఆంధ్రప్రదేశ్ (+91-9441041266)

ఈ సమ్మేళనంలో పాల్గొనదలచినవారు తమ యొక్క అనుభవాలను నివేదికల రూపంలో ముందుగా పంపించడంకానీ, అక్కడికక్కడే పంచడంగానీ చేయగలరు. పంపించాల్సిన చిరునామా.

చిత్రాసహస్రబుద్దే
10-82/ఎ, అశోక్‌మార్గ్, విద్యాశ్రమం,
సారనాథ్, వారణాసి - 221007
vidyaashram@gmail.com

ఈ నివేదికలన్నీ వీలువెంబడి అన్ని భాషలలోనూ అన్ని రాష్ట్రాలలో పంచిపెడుతూ లోకవిద్య స్వరాజ్ ద్వారానే దోపిడి లేని సమాజ నిర్మాణం జరుగుతుందని ప్రస్తుత అభివృద్ధి నమూనాలో లాభాలు, వ్యక్తిగత ఆస్తులు పెంచుకోవడం కేంద్రంగా జరుగుతుండగా ప్రత్యామ్నాయ మార్గంలో అన్ని రకాల ఉత్పత్తులు స్థానిక వనరులతో, స్థానికవ్యక్తుల ద్వారా స్థానిక వినియోగానికి జరిపి తద్వారా పర్యావరణాన్ని రక్షించుతూ ప్రకృతితో సహజీవనం చేసే లోకవిద్యాధర సమాజాన్ని నిర్మించడానికి దోహదపడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

- లోకవిద్యా ప్రపంచం సంపాదకమండలి

## అన్ని దేశాల, ప్రాంతాల సమస్యలకు ఏకైక పరిష్కారం లోకవిద్య

(నేడు ప్రపంచవ్యాప్తంగా తిండి, బట్ట, ఇల్లు, ఆరోగ్యం, చదువు, రవాణా, వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తులు ఒకటేమిటి అన్ని నిత్యావసరాల రంగాలలోనూ పరిశోధనలు ప్రతీ విశ్వవిద్యాలయంలోనూ పెద్ద ఎత్తున జరగటం, ఆ ఫలితాలను మేథోహక్కుల పేరుతో కొంతమంది గుప్పిట్లో ఉండటం, దానితో ఆ రంగంలో పెనుమార్పులు రావటం చూస్తున్నాం. ఈ మార్పులన్నిటి వెనుక ఒకే సూత్రం పనిచేస్తోంది. పై మానవ అవసరాలను మరింత సౌకర్యంగా చౌకగా అందించి, పెద్ద ఎత్తున లాభాలెలా చేసుకోవాలన్న ఏకైక సూత్రమే ఈ పరిశోధనల లక్ష్యం. పచ్చికాయల్ని ఈ రోజు నిల్వచేసి ప్రపంచంలో ఏ ప్రాంతలోనైనా దిగుమతి చేసుకున్న వెంటనే పండించి ఎక్కువ ధరకు అమ్మటం చూస్తున్నాం. కొన్ని దేశాలు ఒకటి, లేదా 2 రకాలు మాత్రమే పంటలు పండించి ఎగుమతులు చేస్తూ మిగతా అన్ని అవసరాల కోసం దిగుమతులమీద ఆధారపడుతున్నాయి. గల్ఫ్, అరబ్బు దేశాలు డీసిల్, పెట్రోల్ ద్వారా ప్రపంచంలోనే అత్యంత ధనికులయ్యారు. నేడు వీటికి ప్రత్యామ్నాయాలు దొరకడంతో ఈ రోజు ఈ దేశాల్లో నిరుద్యోగం విలయతాండవం చేస్తోంది. ఈ విధంగా ప్రపంచ పరిశోధనల వల్ల మనకు సౌకర్యాలు ఎంత బాగా పెరిగాయో అంతేవేగంగా కొత్త కొత్త వ్యాధులు, సమస్యలు సంపద కేంద్రీకరణ పెరిగాయి. ఈనాడు ప్యాకింగ్ చేసిన వస్తువులు వినియోగిస్తే జబ్బులు వస్తాయన్నది నగ్నసత్యం. పట్టణప్రాంత ఆకుకూరల్లో ఉందన్నది కూడా అంతే సత్యం.

అందుకే ఈ మధ్య సేంద్రీయ పంటలు తినమని, తృణధాన్యాలు, ఆకుకూరలు మరియు పప్పులవాడకం పెంచమని, ప్యాకింగ్ చేసిన పదార్థాలను ప్రోత్సహించవద్దని అన్ని రకాల వైద్యులు చెప్పడం చూస్తున్నాం. కొద్దిగా నిశితంగా పరిశీలిస్తే పోయిన 70 సం॥ల పరిశోధనలు గంటలలో కాయలను పళ్ళుగా మార్చటం (కార్బైడ్‌ద్వారా) రసాయనాలనుపయోగించి, ప్రిజ్‌లనుపయోగించి తినే పదార్థాలను వారాల తరబడి, నెలల తరబడి వినియోగించడం జరుగుతోంది. ఈ రోజు ఈ ప్రక్రియలన్నీ భయంకరమైన వ్యాధులకు దారితీసాయని కనిపెట్టడం జరిగింది. తాటాకు ఇళ్ళు, పెంకుటిళ్ళు, చవిటిమిద్దెలు, సున్నంతో కట్టిన డాబాలల్లో నివసించినంతకాలం మన విద్యుత్ అవసరాలు నామమాత్రమే. ఈనాటి బహుళ అంతస్తుల భవనాల్లో గాలికోసం, వెలుతురుకోసం ఇంట్లో బయటకు, లోపలకు మసలడంకోసం, నీళ్ళకోసం, పీల్చివదిలిన గాలి బయటకు పంపడంకోసం, వేణ్ణీళ్ళకోసం, వంటకోసం ఒక్కటేమిటి జీవించే ప్రతీక్షణం విద్యుత్ అవసరం విపరీతం. ఒక్క ఢిల్లీవద్ద నోయిడా పట్టణంలో వినియోగించే విద్యుత్‌తో భారతదేశంలోని ప్రతీగ్రామంలోని ప్రతి ఇంటిలో వెలుగుకోసం విద్యుత్ సరఫరా చేయొచ్చని తెలుసా. ఈ 70 సం॥ల అభివృద్ధిలో క్లబ్‌లు, బార్‌లు, జూదశాలలు, వ్యభిచారం, నల్లధనం, హత్యలు, దోపిడీలు విపరీతంగా పెరగడంతో పాటు అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు కూడా పెరుగుతున్నాయి. అంటే ఉమ్మడి కుటుంబాలు తద్వారా వచ్చే కుటుంబ విలువలు, సంస్కృతి, గౌరవం పోవడంలోనే సామాజిక విలువలు నశించాయి. సుదూరప్రాంతాల్లో ఉద్యోగ అన్వేషణలో వెళ్ళిన పిల్లలు తల్లిదండ్రులను ఆశ్రమాలలో వదిలిపెట్టి వెళ్ళినప్పటికీ శాస్త్రోక్తంగా కర్మకాండలు చెయ్యడం మనం చూస్తున్నాం. దీనికన్నింటికి పరిష్కారం స్థానికంగా వుండే వనరులతో స్థానికంగా వుండే ప్రజలంతా తయారుచేసిన వస్తువులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు (జీవామృతం), ఇళ్ళు, వాకిళ్ళు, బట్టలు ఉత్పత్తి, వినియోగాలతో లోకవిద్య ప్రపంచం మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ ప్రవేశపెట్టిన రోజునే సుఖశాంతులతో, ఆరోగ్యంతో మనుషులు బ్రతికే అవకాశం వుంటుంది. దీనికోసం ప్రజాఉద్యమాల జాతీయవేదిక ప్రచురించిన కరపత్రాన్ని, డా॥ క్రిష్ణరాజులు వ్రాసిన లోకవిద్యా బజార్ వ్యాసాన్ని ఈ స్వాతంత్ర దినోత్సవ సంచికలో ప్రచురిస్తున్నాం. - సంపాదకమండలి)

**స్థానికంగానే, ఉత్పత్తి, వినియోగం ఉద్యోగాలు, విద్య, వైద్యం ఉండాలి - లోకవిద్య మూలస్తంభాలు, స్థానికతే**

**స్థానిక ఆర్థిక వ్యవస్థలు**

గత కొద్ది కాలంగా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకోవటం మనం గమనిస్తున్నాం. కొంతకాలం వర్షాభావంతోనూ, మరి కొంతకాలం వరదలతోనూ వ్యవసాయం దెబ్బతిని ఉత్పత్తి తగ్గిపోతోంది. నదుల్లో, డాములలో నీరు తగ్గిపోయి, తాగునీటి సరఫరా కూడా సవ్యంగా జరగటం కష్టమవుతోంది. వర్షాలు లేకపోవటం వలనా, తీవ్ర ఉష్ణోగ్రతల వలనా భూగర్భ జలం పాతాళానికి చేరుతోంది. దేశమంతటా మనం నీటి కొరతను ఎదుర్కొంటున్నాం. ఇది ఆహార కొరతకు కూడా దారి తీస్తోంది. వ్యవసాయాధారితమైన ఈ దేశంలో ఈ పరిస్థితి నిరుద్యోగానికి, సమాజంలో అలజడికి కారణం అవుతోంది. వ్యవసాయం నుంచి వచ్చే వనరులూ, నీరు లేకుండా పరిశ్రమలు కూడా పని చేయలేవు. చక్కటి వర్షాలు, సమృద్ధిగా నీరు, మంచి వ్యవసాయ దిగుబడి వీటి పైనే మొత్తం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి వుంది. నిలకడైన వాతావరణం ఉంటేనే మంచి వానలూ, నీరూ, పంటలూ ఉంటాయి. భూతాపం వలన మన వాతావరణం రానురానూ మారిపోతోంది. ప్రతీ సంవత్సరం భూమి ఉష్ణోగ్రత పెరుగుతోంది. బొగ్గుపులును వాయువును పీల్చుకొనే అడవులూ, చెట్లూ తగ్గిపోవటం, విద్యుచ్ఛక్తి, వనరుల వినియోగం పెరిగిపోవటంతో కార్బన్‌డయాక్సైడ్, మీథేన్ వంటి వాయువులు పెరిగి భూతాపం పెరిగిపోతోంది.

ఈ పరిస్థితికి మూల కారణమేమిటో తెలుసుకోకుండా పై పై పరిష్కారాలు వెతుక్కుంటూ ఉన్నాం. ఉదాహరణకు, ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు మనం మరిన్ని ఎయిర్ కండిషనర్లు

ఉపయోగిస్తాం కానీ, అడవులను పెంచటం గురించి ఆలోచించం. మన విద్యుత్ దాహంతో బొగ్గు, యురేనియం తవ్వకాలు సాగిస్తూ విలువైన అడవులను నరికేస్తూ, బొగ్గు, గ్యాసులను మండించటం వలన భూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇదేకాక, మనం డాములు నిర్మిస్తూ అడవులను ముంచివేస్తున్నాం. అడవులు నీట మునిగినప్పుడు మీథేన్ వాయువును విడుదల చేస్తాయి. ఈ వాయువు భూ ఉష్ణోగ్రతను పెంచుతోంది. భూమి ప్రమాదంలో పడింది. అలాగే మన జీవితాలు కూడా ప్రమాదంలో పడ్డాయని వేరే చెప్పనక్కర్లేదు..

ఈ పరిస్థితి మారాలంటే మనం ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, ఇంధనం తక్కువగా వాడుకునే ఆర్థిక వ్యవస్థ వైపు వెళ్ళాలి. ప్రస్తుతమున్న ఆర్థిక వ్యవస్థలో ఉన్న పెద్ద సమస్య ఏమిటంటే, వస్తు ఉత్పత్తి, వినియోగం, ఈ రెండూ, ఒకే చోట అధిక వస్తువులు తయారయ్యేటటువంటి కేంద్రీకృత వ్యవస్థలో ఉన్నాయి. వస్తువుల ఉత్పత్తి, ఇంధన వినియోగం ఎక్కువగా ఉండే భారీ యంత్రాంగం ద్వారా, పెద్ద పెద్ద ప్రాజెక్టుల ద్వారా సాగుతోంది. వీటికి వనరులను ఎక్కడెక్కడో దూరాల నుంచి తీసుకొస్తారు. దీనివల్ల ఇంధనము (పెట్రోల్, విద్యుత్), సహజ వనరుల వినియోగం అధికమై భూతాపం పెరుగుతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే వస్తు ఉత్పత్తి, వినియోగాలు స్థానికంగా జరిగేటట్లు చూడాలి.

**సమస్యకు పరిష్కార మార్గాలు ఆహారోత్పత్తిని స్థానికీకరించటం**

రసాయనిక వ్యవసాయం సహజ వాయువునూ, పెట్రోలియంనూ ఎక్కువగా ఉపయోగించి తయారుచేసే రసాయనిక ఎరువులూ, పురుగు మందుల ద్వారా జరుగుతుంది. ఈ పద్ధతులను ఉపయోగిస్తున్నందువల్ల (పెట్రోలియంను మండించటం వలన) భూతాపం పెరుగుతోంది. అంతేకాక ఈ రసాయనాలు భూమిని, ఆహారాన్ని, నీటిని కూడా కలుషితం చేస్తూ, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులు పెరగటానికి కారణం అవుతున్నాయి. వ్యవసాయంలో స్థానికంగా దొరికే సహజమైన ఎరువులు, అంటే పొలంలో దొరికే పేడ, పచ్చి రొట్ట వంటివి వాడుతూ, పురుగులను సహజంగా పారద్రోలే వేప, సీతాఫలం, గోమూత్రం వంటివి ఉపయోగించటం వలన, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. ఫ్యాక్టరీలో తయారయ్యే రసాయనిక ఎరువులు, పురుగు మందులను రవాణా చేయటానికి అయ్యే ఇంధన వినియోగాన్ని కూడా తగ్గించవచ్చు. రైతులకు పెట్టుబడి ఖర్చూ తగ్గుతుంది. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు.

**ఆహార వినియోగాన్ని స్థానికీకరించటం**

స్థానికంగా దొరికే వనరులతో ఉత్పత్తి చేయటం మాత్రమే కాకుండా స్థానికంగా దొరికే ఆహారాన్ని మాత్రమే తీసుకోవటం ద్వారా మనం ఈనాటి వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేయవచ్చు. ఎందుకంటే ఆహారాన్ని ఒకచోటి నుంచి మరొక చోటుకు రవాణా చేయటానికి చాలా ఇంధనం ఖర్చువుతుంది. మీ ఇంటి దగ్గరలోనే పండించే ఆహారాన్ని తీసుకోవడం వలన భూమి, సహజ వనరులూ రక్షించబడతాయి. తాజా ఆహారాన్ని ఎక్కువగా తినడం వలన మన ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇంధన దిగుమతుల మీద అయ్యే ఖర్చు తగ్గుతుంది. రైతులు మంచి రాబడి కోసం దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదు. దేశం మొత్తంగా ఆరోగ్య సంరక్షణకు పెట్టే ఖర్చు కూడా చాలా వరకూ తగ్గుతుంది.

**వస్త్ర ఉత్పత్తిని స్థానికీకరించడం**

ప్రపంచంలోకెల్లా అందమైన వస్త్రాలను నేసే నైపుణ్యం గల నేత కళాకారులు మనదేశంలో ప్రతీ రాష్ట్రంలోనూ ఉన్నారు. వీరు తయారుచేసే వస్త్రాలు వాడటం వలన వస్త్రాల తయారీకి అయ్యే విద్యుచ్ఛక్తి వినియోగం తగ్గుతుంది. భారతదేశంలలో ఉన్న జనాభా ఎక్కువ కాబట్టి, మనమంతా స్థానికంగా తయారయ్యే చేనేత వాడకాన్ని అలవాటు చేసుకుంటే, బట్ట తయారీకి, రవాణాకూ అయ్యే విద్యుచ్ఛక్తి వినియోగం తగ్గడమే కాకుండా, నేతపనివారి జీవనాధారాన్ని మనం నిలబెట్టినవారం అవుతాము. (పది కోట్లమంది జనాభా చేనేత పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు.)

**నీటి సరఫరా స్థానికీకరించడం**

విలువైన వర్షపు నీటిని చెరువులలో సంరక్షించుకోవడం మన చరిత్రలో ఉంది. ఆయా ప్రాంతాలలో నీటి వినియోగం కోసం, స్థానికంగానే నీటిని నిలువ చేసేవారు. రానురానూ ఈ పద్ధతులన్నీ కనుమరుగైపోతున్నాయి. దీనివల్ల ఇప్పుడు ప్రతీ ఊరూ, గ్రామం కూడా ఎక్కడో దూరాన ఉన్న రిజర్వాయర్ల నుండి పైపుల ద్వారా వచ్చే నీటి మీదనో, బోరు బావుల మీదనో ఆధారపడే పరిస్థితి వచ్చింది. అడవులు తరిగిపోవటం వలన, వర్షపునీటిని స్థానికంగా నిలువ చేసే పద్ధతులు నశించడం వలన, రిజర్వాయర్ల నీటిమట్టాలూ, భూగర్భ జలాలూ కూడా తరిగిపోతున్నాయి. చాలా దూరాల నుంచి నీటిని లిఫ్ట్‌చేసి పైపుల ద్వారా తేవడానికి, ఖర్చయ్యే ఇంధనం సంగతి సరేసరి. చెరువులను పునరుద్ధరించి, విలువైన వర్షపు నీటిని ఎక్కడిక్కడ సంరక్షిస్తే మన స్థానిక అవసరాలు తీరుతాయి. భూమిలో నీటి ఊట కూడా పెరుగుతుంది. పెద్ద ఎత్తున ఎత్తిపోతల పథకాల ద్వారా, డాముల ద్వారా నీటిని దూరం నుండి సరఫరా చేస్తూ పంటలు పండించే పద్ధతి మాని, వరి, గోధుమ వంటివి కాక, తక్కువ నీరు అవసరమయ్యే తృణధాన్యాలను (జొన్న, సజ్జ, రాగి వంటివి) పండించడం మంచింది. ఇవి ఎంతో ఆరోగ్యకరమైనవి కూడా. దూరం నుండి సరఫరా అయ్యే నీటి మీద ఆధారపడటాన్ని తగ్గించుకుని స్వయం సమృద్ధిని సాధిస్తే, భూతాపం కూడా తగ్గుతుంది.

**వ్యర్థ పదార్థాల నిర్వహణను స్థానికీకరించటం**

ఈ రోజుల్లో మన చిన్న పట్టణాలూ, నగరాలలో విపరీతంగా వ్యర్థ పదార్థాలు తయారవుతున్నాయి. వీటిని దూర ప్రాంతాలకు తరలించి, ఆ ప్రాంతాలను కాలుష్య కేంద్రాలుగా తయారు చేస్తున్నాం. ఈ చెత్తను ఆ ప్రాంతాలలో కాల్చి వేయడం వలన, భూతాపం పెరుగుతోంది. మనం స్థానికంగానే చెత్తను నిర్వహించుకొనే ప్రయత్నం చేపట్టాలి. అంటే తడి చెత్తనూ, పొడి చెత్తనూ విడదీసి, తడి చెత్తను కంపోస్టు చేసి నగరాలలో ఉద్యానవనాలు పెంచడానికి ఉపయోగిస్తూ, భూమిలో కలిసిపోకుండా వుండే ప్లాస్టిక్ (ఇది కూడా పెట్రోలియంతోనే తయారవుతుంది) వంటి వస్తువుల వాడకాన్ని అరికడితే, మనం భూకాలుష్యాన్ని, జల కాలుష్యాన్ని తగ్గించి, విద్యుచ్ఛక్తిని ఆదా చేస్తూ, పరిసరాలను కాపాడుకోవచ్చు. పారిశుద్ధ్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణను స్థానికంగానే చేపడితే, మన నదులు శుభ్రంగా ఉండి, మన ఆరోగ్యాలు బాగుపడతాయి. పర్యావరణాన్ని ముందు పాడుచేస్తూ, మళ్ళీ శుభ్రం చేసుకుంటూ ఉండటం కోసం పెట్టె ఖర్చు తగ్గుతుంది.

**విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని స్థానికీకరించటం**

స్థానికంగా ఎప్పుడూ దొరికే బయోగ్యాస్, సౌర, పవన వంటి సహజ వనరులని వినియోగించి విద్యుత్తును ఎక్కడికక్కడ తయారు చేసుకోవడం అంటే, ప్రతీ గ్రామంలోనూ, చిన్న ఊర్లలోనూ, ఇంకా నగరాలలో ఉండే కాలనీలలోనూ, ఎక్కడికక్కడ స్థానికమైన ముఖ్య అవసరాలకు సరిపడా విద్యుత్తును తయారుచేసుకొనే పద్ధతి వలన స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంటే సౌర విద్యుత్తు కోసం ఎలక్ట్రిషయన్లు వగైరా... అంతేకాక సహజ వనరులను నశింపజేసి భూతాపాన్ని పెంచే బొగ్గు గనుల తవ్వకాలూ, దూరాలకు విద్యుత్తు సరఫరా చేయడం, దానికోసం విద్యుత్ కేంద్రాలు, విద్యుత్తు లైన్లు నెలకొల్పడం వంటి అవసరాలు తగ్గుతాయి.

**అమ్మకాల స్థానికీకరణ**

స్థానికంగా ఉండే మండీలూ, సంతల్లో ఆ ప్రాంతంలో తయారయ్యే వస్తువులను అమ్మటం వలన వస్తువుల రవాణాకు అయ్యే ఇంధనం దాని ఖర్చు తగ్గుతుంది. మండీలు, సంతల్లో దుకాణాలు అతి తక్కువ విద్యుత్తును వాడతారు. కేంద్రీకృత షాపింగ్ మాల్స్‌ను భారీ ఎత్తున నిర్మించటానికి అయ్యే వనరులు, ఇంధనం, నడిపించడానికి అయ్యే విద్యుచ్ఛక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మండీలు, సంతల పద్ధతిలో వనరులను కాపాడుకోవటమే కాకుండా కోట్లాది చిన్న వ్యాపారులను జీవనోపాధి దొరుకుతుంది.

**ఇళ్ళ నిర్మాణంలో స్థానిక వనరులు**

ఆయా ప్రాంతాలలో దొరికే పదార్థాలను ఉపయోగించి, ఎక్కడి వాతావరణానికి అనువుగా అక్కడ ఇళ్ళు నిర్మించుకోవడం అనే పద్ధతిని ఇండియన్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వంటి సంస్థలు అభివృద్ధి చేసాయి. స్థానికంగా దొరికే మట్టినీ, తాపీ పనివారి నైపుణ్యాన్నీ ఉపయోగించి తయారుచేసే మట్టి బ్లాకుల వంటి ఎన్నో కొత్త తరహా నిర్మాణ పద్ధతులను కనుగొన్నాయి. సిమెంట్, ఇటుకలతో నిర్మాణానికి కావలసిన అత్యధికమైన రవాణా ఖర్చులూ, ఇంధన వినియోగం కాలుష్యం వంటి సమస్యలు తగ్గి, స్థానికులైన పనివారికీ, తాపీ మేస్త్రీలకూ మరింత పని దొరుకుతుంది. మన నదులలోని ఇసుక కూడా కాపాడుకోవచ్చు.

**అత్యవసర సేవల స్థానికీకరణ**

ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి అత్యవసరమైన సేవా రంగాలను ప్రతీ గ్రామంలోనూ, చిన్న నగరాలలోనూ, వార్డులలోనూ పెట్టడం వలన ఈ సౌకర్యాల కోసం ప్రజలు వేరే చోట్లకు వలసలు వెళ్ళవలసిన అవసరం తగ్గి, నగరీకరణ తగ్గుతుంది. ఈ సౌకర్యాలను స్థానిక ప్రభుత్వ సంస్థలే అందించాలి. అలాగే ఈ సౌకర్యాలను ప్రభుత్వం సరిగ్గా నడిపేలా చూసే బాధ్యతను స్థానిక ప్రజలకు ఇవ్వాలి.

పైన వివరించిన చర్యలను తీసుకుంటే స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలపడి, ప్రపంచీకరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులూ, ప్రభావాలు మనమీద పడకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన, నిలకడైన పర్యావరణానికి, చక్కని నాణ్యమైన జీవన విధానానికి మార్గాన్ని చూపిస్తాయి. భూతాపాన్నీ, దాని ద్వారా వచ్చే మన కష్టనష్టాలనూ మరింత పెరగకుండా అడ్డుకుంటాయి.

స్థానిక ఆర్థిక వ్యవస్థ జీవనోపాధినీ కాపాడుతుంది. భూమిని రక్షిస్తుంది.

**- కవుల సరస్వతి, ప్రజాఉద్యమాల జాతీయవేదిక, హైదరాబాద్**

# ఇండోర్ జ్ఞాన సమ్మేళనంపై ఒక నివేదిక

ఏప్రిల్ 6, 2016న శివాజీనగర్ మిల్లు ప్రాంగణం, ఇండోర్‌లో రైతుల మరియు వృత్తిదారుల పంచాయితీ జరిగింది. ఎండకు ఏమాత్రం వెరవకుండా రైతులు, వృత్తిదారులు, ఆదివాసీలు, తోపుడుబండ్లవారు, చిన్నదుకాణాదారులు మరియు ఉద్యమ కార్యకర్తలు ఉదయం 10 గం॥ల నుండి మండుటెండను సైతం లక్ష్య పెట్టకుండా సాయంత్రం వరకు చర్చించారు. దిలీప్ కుమార్ డిలి వారణాసి నుండి లోకవిద్య జనాందోళన పక్షాన కీలక ప్రసంగం చేస్తూ ఈ దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఈనాటి వరకు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సుఖజీవనాన్ని సాగించేది ప్రభుత్వోద్యోగులనీ దానికి ముఖ్య కారణం వారి ఉద్యోగం 30-40 సం॥లు శాశ్వతంగానూ ఖచ్చితమైన నెలసరివేతనం, ప్రతీ ఐదు-పది సం॥లకు వేతన సవరణలు, ప్రతీ పదేళ్ళకు పదోన్నతులతో సుఖమైన జీవనం సాగిస్తున్నారని, రైతులు, రైతుకూలీలు, చేనేతపనివారు, కుమ్మరి, కమ్మరి, కంసాలి, వడ్రంగి, గీత, మత్స్యకార, తోలు పరిశ్రమలలో పనిచేసే వృత్తిదారులంతా సమాజానికి కావాల్సిన అవసరాలను తీర్చినప్పటికీ ప్రతీక్షణం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, వీరి సంపాదన వైద్యం, విద్యమీద ఎక్కువగా ఖర్చవుతోందని చెప్పారు.

వ్యవసాయదారులు, వృత్తికారులు తమజ్ఞానాన్ని తల్లిదండ్రుల నుండి, నిష్ణాతులైన స్థానిక గురువుల నుండి నేర్చుకొనడంతో పాటు నిరంతర పరిశోధన ద్వారా ప్రజల జీవితాలను సౌఖ్యవంతంగా చేయడానికి కృషిచేస్తున్న వీరి సంపాదన సంవత్సరానికి 6, 8 నెలలు మించదనీ, ప్రభుత్వోద్యోగుల కొచ్చే వేతనాలలో సగం కూడా రావడం లేదని ఆవిధంగా వీరు దోపిడీ గురవుతున్నారని వివరించారు.

శ్రీమతి దేవరి నిర్మల, షేర్‌సింగ్, మగన్‌సింగ్, సుష్మాయాదవ్, సుమేర్‌సింగ్, మంగళహర్దియాస్థానిక వనరులతో స్థానిక ఉత్పత్తులతో, స్థానిక బజార్లతో స్థానికంగా జీవన ప్రమాణాలను పెంచాలని వివరించారు.

ఇండోర్ ప్రెస్‌క్లబ్‌వారు, వివిధ వృత్తిదారులు, పాత్రికేయులతోపాటు దూరప్రాంతం నుండి వచ్చిన వక్తలందరూ జీవితాన్ని మరింత సౌఖ్యవంతంగా, ఆహ్లాద పూరితంగా తయారుచేయడాన్నే అభివృద్ధి నమూనా అంటారని కానీ ప్రస్తుత పరిస్థితులలో కొద్దిమంది వద్ద విపరీతంగా ధనం పోగయ్యే ఆర్థిక వ్యవస్థవల్ల అందరూ నష్టపోతున్నారని వివరించారు. లోకవిద్య సమాజ నిర్మాణంలో ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనా ద్వారా పర్యావరణాన్ని రక్షిస్తూ, అందరికీ ఉపాధికల్పిస్తూ స్థానిక వనరులతో, స్థానికంగా ఉత్పత్తి, సేవలు తయారుచేస్తూ సౌఖ్యవంతమైన జీవితానికి దారితీస్తుందనీ వివరించారు. భారతీయ కిసాన్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, దేశంలోనే ప్రధాన ఉపాధిరంగం వ్యవసాయానికి తగిన గిట్టుబాటుధర రావడం లేదని వాపోయారు.

సునీల్ సహ్రసబుద్దే మాట్లాడుతూ స్వరాజ్యం అంటే స్థానికంగా నిర్ణయాలు తీసుకొనడానికి వ్యవసాయదారులు, వృత్తిదారులు, ఆదివాసులు, మహిళలు, చిన్నదుకాణదారులు స్థానికంగా ఇటువంటి సమ్మేళనాలలోనే ఏవిధంగా తమ జ్ఞానం ద్వారా ఉత్పత్తైన వస్తువులు, సేవలు మాత్రమే సమాజాన్ని నడిపిస్తున్నాయో గుర్తెరిగి లోకవిద్యేతర పెద్ద పెట్టుబడిదారుల ఉత్పత్తులు సేవలు ఉపయోగం తగ్గించుకోవాలని తద్వారా లోకవిద్య స్వరాజ్యాన్ని సాధించుకోవాలని పిలుపిచ్చారు.

ఇండోర్ పంచాయితీకి స్ఫూర్తి నిచ్చిన సింగ్రౌలీ, ఔరంగబాద్ మహాసభల గురించి సంజీవ్ కీర్తనే, అవదేశ్ కుమార్ విపులంగా వివరించారు. ప్రేమలతాసింగ్, యహసాన్ అలీ మొదలైన వృత్తిదారుల జ్ఞానాన్ని వివరిస్తూ లోకవిద్యధర సమాజమే వృత్తిదారుల వస్తువులు కొనవల్సిన అవసరాన్ని ప్రచారం చెయ్యాలని వివరించారు. తరతరాలుగా వచ్చిన జ్ఞానాన్ని ముఖ్యంగా మొండిజబ్బుల్ని తగ్గించే ఆయుర్వేద, యునసీవైద్యాల గురించి, ఆరోగ్యంగా వుంచే తృణధాన్యాల గురించి, తక్కువ నీటితో పండించే స్థానిక వంగడాల గురించి వివరిస్తూ ఈ సమాజం నుండి అంకితభావంతో పనిచేసే పదిమంది కార్యకర్తలు దేశ వ్యాప్తంగా సమ్మేళనాలను ఏర్పాటుచేసి లోకవిద్య స్వరాజ్య స్థాపనకు కృషిచేయాలని హైదరాబాద్ నుండి లలిత్‌కౌల్ వివరించారు. ఈ సమ్మేళనాలన్నింటిలోనూ స్థానిక భాషలో, జానపద రూపకాల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయబడ్డాయి. ఇటువంటి సమ్మేళనాలు ప్రతీ జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ ఏర్పాటు చేయడానికి కృషి సల్పాలని తీర్మానించడమైనది.

**- సంజీవ్ కీర్తనే**

**అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే**

# గ్రామ స్వరాజ్యం కోసం నూతన గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో లోకవిద్యాబజార్లను నిర్మించాలి.

సామాజిక న్యాయంకోసం గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ జీవనోపాధి కోసం ఒక్కమాటలో చెప్పాలంటే అందరికీ ఆత్మగౌరవంతో బ్రతికే హక్కుకోసం లోకవిద్యా సమాజ నిర్మాణం కోసం లోకవిద్యా బజార్లను స్థాపించాల్సిన అవసరం ఈనాడు ఎంతోవుంది. బజార్లంటే కొనుగోలుదారుడు, అమ్మకం దారుడు కలిసే ప్రదేశమని అందరికి తెల్సిందే. ఇక్కడ జరిగే లావాదేవీలే అంతిమంగా సమాజంలోని ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలను నిర్దేశిస్తాయి. అందుకే లోకవిద్యా బజార్లో ఒక గొప్ప లోకవిద్య సాంస్కృతిక విప్లవ అవసరాన్ని ఈనాడు మనం గుర్తించాలి.

1. లోకవిద్య ధర్మాన్ని పాటిస్తే మనుషులందరి మధ్య సమానత్వం సాధ్యమే

ధర్మం అనే పదానికి లోకవిద్యలో చాలా విస్తృతమైన అర్థం వుంది. మానవ సంబంధాలలో మనకున్న జ్ఞానం ద్వారా సమాజ శ్రేయస్సుకోసం వుండాల్సిన సంబంధాలను ఒక క్రమపద్ధతిలో పెట్టడంకోసం అనుసరించాల్సిన మార్గమే ధర్మం. ఈ ధర్మంలో వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, ప్రకృతితో సహజీవనం అన్నీ కలిసున్నాయి. గాంధీగారు సనాతన ధర్మం అన్న పేరుతో మానవుల మధ్య సంబంధాలు సరైన జీవన విధానానికి దారితీయాలని కాంక్షించారు. దీనిలో జీవించడానికి తమ జ్ఞానం ద్వారా ప్రతీ ఒక్క పౌరుడికీ జీవించే హక్కు కల్గి వుండడం, తను తయారుచేసే వస్తువులను లోకవిద్యాబజార్ ద్వారా అవసరమున్న వారికి సరఫరా చేయడమేగాక, దానికి సరియైన మూల్యాన్ని అందుకునే హక్కు కలిగి వుండడం సహజధర్మం. ఈపై విషయాలన్నీ ఆకలింపుచేసుకోవడమే లోకవిద్య.

2. మేధోపరమైన అసమానతలే సామాజిక, ఆర్థిక అసమానతలకు కారణం

భారతీయ జ్ఞాన చరిత్రలో జ్ఞానం రెండు విధాలు ఒకటి పరవిద్య, రెండవది అపరవిద్య. ఈ రెండింటి మధ్య విభజన అత్యంత క్లిష్టమైనదని ఈ తేడా త్రేతాయుగానికి, ద్వాపరయుగానికి మధ్యలో ప్రవేశపెట్టబడిందని ఆచార్యధర్మపాల్ తనచరిత్ర గ్రంథంలో వివరించారు. వేదాలు, వేదాంగాలైన బ్రహ్మణాలు, ఉపనిషత్తులు మొదలైనవి ప్రధానంగా పరవిద్య గురించి, పురాణాలు, ఇతిహాసాలతోపాటు ఆయుర్వేదశాస్త్రం, జ్యోతిష్యశాస్త్రం మొదలైనవి ఇహలోక సంబంధమైన అపర విద్యల గురించి చెబుతున్నాయని కూడా వ్యక్తీకరించారు.

ఈ రెండు రకాల జ్ఞానాలు మానవ జీవితంలో అవసరం వున్నప్పటికీ ఏ కారణంవల్లనో అపరవిద్యకంటే పరవిద్య గొప్పదనే భావనలో భారత సమాజం తరతరాలుగా విశ్వసిస్తోంది. ఈ పరవిద్యకు అత్యంత ప్రాధాన్యత నివ్వడంతోపాటు అపరవిద్యకు తగిన గుర్తింపు నిరాకరించడం భారత సమాజంలోని ప్రధాన వైరుధ్యం. ఈ పరవిద్య దానికి సంబంధించిన గ్రంథాలు కొద్దిమంది మాత్రమే చదువుతూ, ఆచరిస్తూ ఆధిక్యత ప్రదర్శించడంతో ఈ రెండు విద్యల మధ్య వైరుధ్యమే ఈ వ్యవస్థలో ప్రధాన వైరుధ్యంగా మారిపోయింది. పరవిద్యలో ప్రవేశమున్న బ్రాహ్మణులు గొప్పవారని, దాన్ని ఆచరించే బ్రాహ్మణులు వేదాల మీద వారికున్న పట్టువల్ల ఆధిక్యత కల్గి వున్నారనే భావనే ఈ వైరుధ్యానికి మూలం. దైనందిన జీవితంలో కావల్సిన కళలు, వృత్తులు ఆచరించే వారంతా శూద్రులని, ఈ వ్యవహారాలన్ని తేలిక దృష్టితో చూడడం ప్రారంభించారు. అసలు జ్ఞానమంటే పరవిద్యేననే అభిప్రాయం ప్రవేశపెట్టడమే ఈ రెండింటి మధ్య తీవ్రవైరుధ్యానికి దారితీసాయి. సంతోషకరమైన విషయమేమంటే వర్ణాశ్రమధర్మంలో హెచ్చుతగ్గులు అనే ప్రశ్న ఏనాడు అంతిమంగా పరిష్కరింపబడలేదు. 2000 సం॥ల చరిత్రలో మనకివే కనబడతాయి. వ్యాసమహర్షి ఈ హెచ్చుతగ్గుల్ని చూసి చింతించి దీని నిర్మూలనకోసం పురాణాల్ని వ్రాసారు. దానిలో నాటి స్త్రీలు, శూద్రులు అధమస్థానంలో వున్నారనీ, రాబోయే కలియుగంలో స్త్రీలకు, శూద్రులకు సరిఅయిన స్థానం లభిస్తుందనీ ఆశించారు. ఒక్క మాటలో చెప్పాలంటే పరవిద్య కంటే అపరవిద్య వారే గొప్పవారని చెప్పడం జరుగుతుందని వూహించారు. అందుకే గాంధీజీ అందరినీ శూద్రులుగా జీవించమని కోరారు.

జ్ఞాన సంబంధంగా హెచ్చుతగ్గులు : పాశ్చాత్య ప్రపంచంలో కూడా ఈ హెచ్చు తగ్గులు వున్నాయి. 14వ శతాబ్దం ప్రారంభంలో రైతుల తిరుగుబాటుకు పునాదివేసిన జాన్‌బాల్ విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు ఉపదేశించేవాడు. లాటిన్‌భాషలో పురోహితులు ప్రజలకు జ్ఞానాన్ని పంచిపెడితే ఈయన స్థానిక భాషలో అదే జ్ఞానాన్ని చెప్పి చర్చితో తలపడేట్లు చేస్తే అంతిమంగా అది రైతుల తిరుగుబాటుకు దారితీసింది. జాన్‌బాల్ ఆదాం పొలంపని చేస్తుండగా, ఈవ్ వస్త్రాలు నేస్తుండగా వారిని శాసించేదెవరు? అని ప్రశ్నిస్తూ భగవంతుని దృష్టిలో అందరూ సమానమని నిర్వచించాడు.

3. సామాజిక న్యాయంకోసం నడుస్తున్న ఈ ఉద్యమంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగాలంటే అన్ని జ్ఞానాలు సమానమని చెప్పే లోకవిద్యకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తూ ప్రతీ వ్యక్తి తన జ్ఞాన ఆధారంగా ఇతరులతో సమానంగా జీవించే హక్కు కల్గివున్నాడని లోకవిద్య విశ్వసిస్తోంది.

4. ఏనాడైతే - వివిధ వర్ణాల వారి అందరిజ్ఞానం వివిధ కుల, మతాలవారిని సమానం చెయ్యడానికీ, అసమానతల నిర్మూలనకు చేసే ప్రయత్నం ద్వారా మాత్రమే అన్ని జాతులజ్ఞానం సమానమని, అందరూ సమానమనీ, అందరి జీవన విధానాలు సమానమనీ, అందరి కుల, మత జాతులు సమానమనీ లోకవిద్య తెలియచేస్తోంది.

5. ఈ లోకవిద్య ధర్మాన్ని సమానత్వం, సౌభ్రతృత్వం స్థాపించడానికే. లోకవిద్య బజారు నిర్మాణం చాలా అవసరం. దానిద్వారా వస్తువులు, సేవలతో పాటు ఒకరి జ్ఞానాన్ని మరొకరు పంచుకుంటూ ఒకరిమీద మరొకరు ఆధారపడుతూ ఒకరితో మరొకరు పరస్పర సంబంధం కల్గి వుండడం ద్వారా అసమానతలులేని నూతన మానవ సమాజ సృష్టికి దారితీస్తుందని లోకవిద్య విశ్వసిస్తోంది.

6. లోకవిద్యాబజార్ విధానంలో నిలకడగా లోకవిద్య ద్వారా వచ్చే ఉత్పత్తులు, సేవలు, జ్ఞానం, పరస్పర మార్పిడి చేసుకుంటూ అందరికి తగిన మూల్యం చెల్లించడం ద్వారా నూతన సమాజ నిర్మాణానికి నాందీపలకాలని లోకవిద్య సూచిస్తోంది.

7. అంతిమంగా లోకవిద్యా సమాజంలోని సభ్యులందరూ నూతన సాంఘిక, ఆర్థిక ఆచరణ ద్వారా నూతన రాజకీయాలకు బాటవేసి దోపిడీలేని సమాజాన్ని నిర్మించాలని లోకవిద్యజనాందోళన ఉద్యమ నిర్మాణాన్ని చేపట్టింది.

**లోకవిద్యా బజార్ అంటే ఏమిటి?**

ప్రధానంగా ముడిసరుకుల సేకరణ, వస్తు తయారీ మరియు దాని వినియోగం జరిగిన తర్వాత మిగిలిన అదనపు విలువను పెట్టుబడి అని మార్క్స్ లాంటివారు నిర్వచించారు. ఉత్పత్తి దారులు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధం వీలుకాదు కనుక స్థానిక సంతలు ఉనికిలోకివచ్చాయి. ఇక్కడ తయారీ దారులు మరియు వినియోగదారులు డబ్బు ద్వారా సరుకులని మార్పిడి చేస్తారు. ఉత్పత్తి దారులకు బదులు స్థానిక చిరువ్యాపారులు వారి వస్తువులను అమ్ముతుంటారు.

నేటి ప్రాపంచీకరణలో నున్న బజార్‌లో అదనపు విలువ మొత్తంగా పెట్టుబడిగా మారి కొద్దిమంది చేతుల్లోకి కేంద్రీకృతమౌతుంటే లోకవిద్య బజార్‌లో ప్రధానంగా జరిగే వ్యాపార వ్యవహారాలు వస్తుమార్పిడి కోసం, సమాజ నిర్వహణకోసం ఉత్పత్తిదారుల జీవనోపాధికోసం ఒక్కమాటలో చెప్పాలంటే అందరూ ఆత్మగౌరవంతో జీవించడానికి పనికొచ్చేదే. నేటి మార్కెట్ యార్డులు మొత్తం వస్తువులనన్నింటినీ (ముడిసరుకు నుండి పాక్షిక తయారీ నుండి పూర్తి స్థాయి తయారీ వస్తువు వరకు) అత్యంత తక్కువ ధరకు కొనుక్కోవడం, దాన్ని రవాణాచేసి అత్యధిక ధరకు ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకోవడం, లాభాపేక్షతో మాత్రమే జరిగే కార్యక్రమం. లోకవిద్యా బజార్‌లో ప్రధాన కార్యక్రమం వినియోగదారులకు ఉత్పత్తిదారులకు మధ్యలో కడు చిరువ్యాపారులు అందరికి సంవత్సరం పొడుగునా వ్యాపకాన్ని కల్పిస్తూ జరిపే ఆర్థిక లావాదేవీల ఏర్పాటే లోకవిద్యా బజార్. ఇక్కడి ధర్మం లాభాన్ని ఒకరిచేతిలో పోగేసుకోవడం కన్నా వస్తుమార్పిడి, వినియోగం, అందరికీ ఉపాధి, సరసమైన ధర అంటే స్థూలంగా మానవజాతి నిర్వహణ ప్రధానంగా జరిపే కార్యకలాపాలు ధర్మంగా ఆచరించేదే లోకవిద్యాబజార్.

లోకవిద్యాబజార్ స్థానిక సంతలుగా ప్రతీ గ్రామంలోనూ కానీ నాలుగైదు గ్రామ కూడళ్ళలోకానీ, ప్రతీవారం జరిగే సంతల వంటివి. ఇక్కడి ధర్మం ప్రధానంగా మానవుడు కేంద్రీకృతంగా, అతని అవసరాల మేరకు స్థానిక ముడిసరుకులతో, స్థానిక ఉత్పత్తిదారులవల్ల, స్థానిక అవసరాలమేరకు అందరికి ఉపాధికోసం కొద్దిపాటి లాభం కోసం, ఒక ధర్మబద్ధంగా జరిగే ఆర్థికలావాదేవీలే.

**లోకవిద్యబజార్‌లోని ప్రధాన ఆర్థిక అంశాలు**

1. విలువ : ఇక్కడి విలువ మూడు అంశాల వల్ల స్థిరపడుతుంది.

మొదటిది ఆ వస్తువు లేదా ముడిసరుకు తయారుచేయడంలో ఉపయోగించిన ప్రకృతినుండి సేకరించిన ముడిసరుకుతోపాటు మానవ జ్ఞానం, నైపుణ్యత మొ॥వి. అంటే ప్రాథమికంగా వ్యవసాయరంగంలో ఉపయోగించి పెట్టుబడి, తెలివితేటలుతో వచ్చిన పంట. రెండు ఆ వస్తువు తయారీలోని మానవశ్రమ అంటే వ్యవసాయంలో ఉపయోగించిన రైతు కూలీలకు ఇచ్చే వేతనం మొ॥. మూడు స్థానికంగా లోకవిద్యాబజార్‌లోకి తెచ్చిన వస్తువుల పరిమాణం, దీన్ని కొనడానికి వచ్చిన వినియోగదారుల మొత్తం డిమాండ్ పై ఆధారపడి వుంటుంది.

ప్రతీ వస్తువులోని ముడి సరుకు విలువ, మానవశ్రమ విలువ నాటి మార్కెట్‌లోకి తేబడిన వస్తువ పరిమాణం మరియు డిమాండ్ పరిమాణం అందరికి తెలియడం మూలాన ఏ ధర నిర్ణయించాలని అనేది తెలిసిపోతుంది. అదే లోకవిద్యధర్మం. సుదూరప్రాంతాలలో తయారయిన వస్తువుల ధర లాభం లేదా దోపిడి అనే ఏక సూత్రం మీద ఆధారపడి నిర్ణయించడం జరుగుతుంది.

2. మానవశ్రమ విలువ నాటి డిమాండ్ సరఫరా మీద ఆధారపడి ధర్మంగా వుంటుంది. అదే నిల్వ ఉండే వస్తువులు ప్యాకింగ్, సుదూర ప్రాంతాలనుండి తెచ్చేదానిలో ముడిసరుకుకు, మానవశ్రమకు ఇతర ఖర్చులు అత్యంత తక్కువగా వున్నచోట తయారై అత్యంత ఎక్కువధర ఉన్నచోట అమ్ముడుపోతాయి. అక్కడ ముడిసరుకు అమ్మకందారుడు, కార్మికులు, వినియోగదారుడు అందరూ దోపిడికి గురవుతారు.

స్థానికంగా తయారయ్యే వస్తువులు ముడిసరుకు నుండి మానవ శ్రమ నుంచి తయారీకి కావాల్సిన ఇతర వస్తువులు స్థానికంగా దొరకడం మూలానా ధరల హెచ్చు తగ్గులలో పెద్దగా తేడా వుండదు. ధరలు స్థానికంగా, ధర్మంగా ఈ వస్తు మార్పిడిలో భాగస్తులందరికీ న్యాయం అనిపించే రీతిలో జరుగుతాయి.

ఏదైనా ఒక వస్తువు విలువ రెండు రకాలుగా వుంటుంది. మొదటిది వినియోగ విలువ. రెండవది మార్పిడి (మార్కెట్) విలువ. లోకవిద్యాబజార్‌లో అమ్మే ప్రతీ వస్తువులో దాని తయారీ ఖర్చు స్థానికంగా అందరికి తెలియడం వలన పెద్ద లాభాలకోసం ఎవరూ అమ్ముకోలేరు. కానీ అదే వస్తువు అత్యంత తక్కువ ధరకు ఉత్పత్తి చేసి అందమైన ప్యాకింగ్ చేసి సుదూరప్రాంతాలకు రవాణాచేసి అత్యంత ఎక్కువ ధరకు అమ్ముకొనిచ్చేదే ప్రపంచ వ్యాప్త మార్కెట్. ఇది లోకవిద్య బజార్‌లో కనబడదు.

ధర నిర్ణయంలో జ్ఞానం యొక్క పాత్ర ఏమిటి? ఒక 100 సం॥ల క్రితం మానవుడికి కావాల్సిన వస్తువులన్నీ (తిండి, వస్తువులు, సరుకులు మొ॥వి). అన్నీ ఆ గ్రామంలోనే ఉత్పత్తి చేసేవారు. ప్రతీ జాతి, ఉపజాతి ఆ ఉత్పత్తుల్లో పాలుపంచుకునేవి. దీంట్లోనే సంవత్సరానికి సరిపడా కావల్సిన వస్తువులు సం॥ పొడుగునా తయారుచేయడానికి ప్రతీ జాతి ప్రకృతి ధర్మాన్ని అనుసరించి విశ్రాంతి, ఆటపాటలు, యాత్రలకు, పండుగలు, సాంఘిక ఉత్సవాలకు సరిపోయే విధంగా ప్రణాళికాబద్ధంగా అందరూ సం॥ అంతా పనిచేసేవారు. ఆ రోజుల్లో సం॥కి వచ్చే ఏకపంటలో వారి వారి పనులను బట్టి పంటలో భాగాన్ని పంచేవారు. ఇది సంవత్సరం అంతా వారి కుటుంబమంతా గౌరవప్రదంగా అన్ని అవసరాలకు సరిపడా ఆదాయం వచ్చేది. ఆ విధంగా గ్రామంలో ప్రజలందరికీ ఉపాధి, ఆదాయం లభించేది. కలిగున్న వారు ప్రత్యేక సేవలనిమిత్తం దానధర్మాలు బహుమతులు ఇస్తూ అందరితో పాటు తమ సంపదను పంచుకునేవారు. ఆవిధంగా వస్తువు విలువలో మానవ శ్రమేగాక మానవ మేధస్సు, సామాజిక దృక్పథం మానవ సంబంధాలలో వ్యక్తమయ్యేది. ఈ ధరల నిర్ణయంలో సమాజమే అందరికి న్యాయబద్ధంగా, సమానంగా వేతనాలు వచ్చే విధంగా వస్తువులకు, శ్రమకు ధర చెల్లించే ఏర్పాటు వుండేది. లోకవిద్యా సమాజధర్మంలో అన్ని రకాల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక మానవ శ్రమ ఆధారిత విలువలకు సరిపడేవిధంగా ధర నిర్ణయం జరిగేది.

నేటి సంక్లిష్ట ఆర్థిక విధానాలలో వస్తువు విలువ లోకవిద్యధర్మం ప్రకారం ఎలా జరుగుతుంది?

నేటి సంక్లిష్ట ఆర్థిక విధానంలో లోకవిద్య ధర్మం ప్రకారం వస్తువు విలువ నిర్ణయించేటప్పుడు జ్ఞానం, నిపుణత మరియు ఉత్పత్తికి వెచ్చించే సమయంనుబట్టి నిర్ణయించడం జరుగుతుంది.

రస్కిన్ గారి పుస్తకం 'అన్ టు దిస్ లాస్ట్' నుండి గాంధీజీ తన ఆత్మకథలో ఈ క్రింది వాక్యాలలో శ్రమ విలువ గురించి ఇలా నిర్వచించారు.

"తమ శ్రమద్వారా జీవించే హక్కు కలిగిన ఒక మంగలి మరియు వకీలు శ్రమ విలువ సమానమే"

"శ్రమైక జీవితంలో ఒక భూమిని దున్నేరైతుకు, చేతివృత్తి కళాకారులవి విలువైన జీవితాలు"

"శ్రమించే వారందరికి సమానమైన గౌరవప్రదమైన వేతనాలు దొరకాలని మంచి పనివారిని నియమిస్తూ, చెడ్డపని వారిని నిరుద్యోగులుగా మిగల్చాలని ఆలోచించడమే సరసయిన పద్ధతి"

పై విషయాలలో అంతర్లీనంగా చెప్పేది ప్రతీవ్యక్తీ చేసే పని ఇతరుల పని విలువలో ఏ మాత్రం తక్కువకాదు.

"ఉత్పత్తి చేసిన వస్తువుల డిమాండ్‌లో హెచ్చుతగ్గులున్నప్పటికీ అందరికీ సమాన వేతనాలపై నిరంతరం పనిదొరికే మార్గాలను అన్వేషించాలి". పై గాంధీజీ అభిప్రాయాలతోపాటు, ప్రముఖ చరిత్రకారుడు ఆచార్యధర్మపాల్ చరిత్రలో నాటి చెంగల్పట్టు జిల్లాలో వేతనాలు ఎలా వున్నాయన్నది ఈ కింద పట్టికలో పేర్కొనడం జరిగింది.

| వృత్తి | సం॥ వేతనం ఒక్కక్కరికి చెల్లించేవి (1 కల్లాం - 125 కేజి) |
|---|---|
| 1) కమ్మరి, వడ్రంగి మొ॥వారు | 20 కల్లాలు - 2500 కేజీలు |
| 2) కుమ్మరి | 7 కల్లాలు - 875 కేజీలు |
| 3) మంగలి | 10 కల్లాలు - 1250 కేజీలు |
| 4) చాకలి | 7 కల్లాలు - 875 కేజీలు |
| 5) వడ్డీ వ్యాపారి | 22 కల్లాలు - 2750 కేజీలు |
| 6) అకౌంటెంట్ గుమస్తాలు | 19 కల్లాలు - 2375 కేజీలు |
| 7) పనివాళ్ళు | 10 కల్లాలు - 1250 కేజీలు |
| 8) పోలీసులు, మిలటరీ | 31 కల్లాలు - 3875 కేజీలు |

సంప్రదాయాలు, పునరుజ్జీవనం, స్వాతంత్ర్యంపై ఆచార్యధర్మపాల్ వ్రాసిన వ్యాసాలలో తమిళనాడు రాష్ట్రంలో చెంగల్పట్టు జిల్లాలో వివిధ వృత్తులవారికి పంటల నుండి చెల్లించాల్సిన కేటాయింపులు పై విధంగా వుండేవి. దీంట్లో అధిక వేతనం పొందేవారు. వివిధ ప్రాంతాలు తిరిగి ముడిసరుకు సేకరించి, కావల్సిన వస్తువులు స్థానికంగా తయారుచేసి ఇచ్చేవారు. అలాగేవారు ఉపయోగించే పనిముట్లు ఖరీదెక్కువైనపుడు అధిక వేతనం అవసరమే కదా!

**వేతనం మరియు ధర** : ఏ వస్తువుకైనా లేదా సేవలకైనా ధర నిర్ణయం. దానిలోని అంతర్గత విలువపై ఆధారపడి వుంటుంది. ఒక మనిషి తన జ్ఞానంతో చేసే పనివల్ల వచ్చే ఆదాయం తన కుటుంబానికి గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించాలని కోరుకుంటాడు. అటువంటి గౌరవప్రదమైన వేతనాన్ని సంపాదించడానికి అయ్యే ఖర్చే వస్తువు యొక్క ఖరీదుగా వుంటుంది. సాధారణంగా పనిగంటలను బట్టి వేతనాల మధ్య వ్యత్యాసముంటుంది. కానీ కొన్నిసార్లు ఇది తర్కానికి నిలబడదు. భూమినుండి ఒక పంట పండాలంటే 2, 3 నెలలు శ్రమించాలి. అదే ఒక ఒక బట్ట నేయాలంటే చాలా తక్కువ సమయం పడుతుంది. ఈ రెండు వృత్తులు మానవ జీవితానికి అత్యవసరాలే. అంతేగాకుండా కొన్నిసార్లు పొలం పనుల్లో ఒకటి రెండు రోజులు పనిలేకపోయిన ఆ శ్రామికులను రాబోయే పనికోసం వుంచుకోవడం జరుగుతుంది. ఇదే పని చెయ్యని కాలానికి వేతనాలు చెల్లించడం (సాలీనా పెట్టుకునే పాలేర్లను ఈ వర్గంలోకి తీసుకురావచ్చు)

**సమర్థవంతంగా బజార్ నిర్వహణ**

**1. పంచాయితీలు** : ఈ లోకవిద్యబజార్‌లో వచ్చే సమస్యలు అంతిమంగా పరిష్కరించడానికి వివిధ వృత్తుల నుండి ప్రతినిధులు, వస్తు ఉత్పత్తిదారులు, సేవలందించేవారు తమ వృత్తులలోనుండి ఎన్నిక కాబడిన నిష్ణాతులతో నిర్మింపబడేది స్థానిక పంచాయితీ. ఇది అత్యంత నిర్ణయాత్మక శక్తి. దీన్నే లోకవిద్యా పంచాయితీగా గ్రామంలో ప్రతీ పనిమీదా ప్రతీ పన్ను మీద అంతిమ నిర్ణయం తీసుకునే వ్యవస్థ. ఇతర

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.

Date of posting 10 & 25 every month
**RNI Regd. No. APBIL/2012/50668**

Date of publication 25-8-2016
**Postal Regn. No. HSE/677/2015-2017**



పంచాయితీలతో జరిపే ఆర్థిక లావాదేవీలు, మండల, జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఉన్న పంచాయితీలతో కలసి దేశ రాష్ట్ర, జిల్లా, మండలపన్నుల వ్యవస్థ నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థ.

**2. స్థానిక యాజమాన్య కమిటి :** పంచాయితీ ఆధ్వర్యంలో తీసుకోబడిన నిర్ణయాల మేరకు దైనందిన కార్యకలాపాల కోసం ప్రతీ బజార్‌లోనూ స్థానిక యాజమాన్య కమిటీ పనిచేస్తుంది. వీరిలో అధికులు స్త్రీలు మాత్రమే ఉంటారు. సమాన హక్కులు కల్గిన వీరందరిని బజార్‌లో కార్యకలాపాలు చేసే వివిధ వర్గాల ప్రతినిధులు ఎన్నుకుంటారు. దీని పరిమాణం బజార్ పరిమాణంతో పెరగనూ వచ్చు, తరగనూ వచ్చు, ఈ కమిటీ ఆధ్వర్యంలోనే స్థానిక సహకార బ్యాంక్ పనిచేస్తుంది. ఈ బ్యాంక్‌ద్వారా వివిధ వృత్తులవారి నుండి డిపాజిట్లు స్వీకరించడమేగాకుండా అవసరం మేరకు నామమాత్రపు వడ్డీతో అన్ని వర్గాలవారికి పనిదొరికేటట్లు కార్యకలాపాలకోసం రుణాలు ఇవ్వబడుతాయి. ఈ బ్యాంక్ రుణాలు సంవత్సరమంతా జీవనోపాధి కల్పించడానికి అన్ని వృత్తుల వారు తమ కాళ్ళమీద తము నిలబడటానికి దోహదం చెయ్యాలి కానీ లాభా పేక్షతో కాదు.

**3. పెట్టుబడి అవసరం :**

ఎ) ద్రవ్య పెట్టుబడి : ఏ బజార్‌కైనా ద్రవ్యపెట్టుబడి ఆవశ్యకత రెండు రకాలు. తక్షణ, దీర్ఘకాల పెట్టుబడులుగా విభజించవచ్చు. వీటికి స్థానిక సహకార బ్యాంక్, స్థానిక యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో అందరికి అవసరాల మేరకు ఏ వర్గానికి నష్టం కలగకుండా వుండే విధంగా సరఫరా చెయ్యడం జరుగుతోంది.

బి) విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పశువులు, పరికరాలకు కావల్సిన పెట్టుబడి దీనికోసమై ప్రతిగ్రామంలోనూ విత్తన బ్యాంక్, వస్తు భండాగారాల ద్వారా వస్తువులను సరఫరా చెయ్యవచ్చు. ఈ వస్తువుల తయారీ దారులకు, అంతిమంగా వినియోగదారులకు అనుసంధానంగా స్థానిక యాజమాన్య కమిటీ తగు చర్యలు తీసుకుంటుంది. ఇక్కడి వ్యాపార వ్యవహారాలన్నీ గ్రామంలో అన్ని వృత్తులవారికి, అన్ని కాలాల్లోనూ పని దొరికే విధంగా దోహదపడతాయి.

సి) మేధోపెట్టుబడి : మారుతున్న నేటి వ్యవస్థలో ఇంటర్నెట్ (అంతర్జాలం) ఆధారంగా వ్యాపారం చేసే అవకాశాలను, ఇతరులు చేస్తున్న వ్యాపారాల అవకాశాలను అంచనాలు వేసుకుంటూ నిరంతరంగా విపత్తు నివారణ చర్యలు తీసుకునే దశలో సమాజ శ్రేయస్సు దృష్ట్యా మానవ సమాజ నిర్మాణానికి ఉపయోగించే పద్ధతులను కూడా స్థానిక యాజమాన్య కమిటీ అవలంబించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే సుదూర వ్యాపారం లాభాపేక్ష కంటే విపత్తు నివారణకై తీసుకునే ఒక చర్యగా లోకవిద్య గుర్తిస్తుంది.

నిర్వహణ మరియు సేవలు :

మానవజాతి ఉత్పత్తి క్రమంలో అధికోత్పత్తి, అసమాన ఉత్పత్తి జరుగుతుందని మనకు తెలుసు. ఇవి ప్రధానంగా వాతావరణ పరిస్థితుల్లో, పెనుమార్పులు, చీడపీడల వ్యాప్తి మరియు అనేక ఇతర విపత్తుల వల్ల జరగవచ్చు. అందుకోసమే పంటలు బాగాపండిన రోజుల్లోనే మనుషులకు పనికొచ్చే ధాన్యాలు, పశువులమేత మొ॥వన్నీ నిల్వచేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అవసరమైన చోట్లకు అవసరమైన మేరకు భూకంపాలు, వరదలు అనావృష్టి సమయంలో పంపడానికై ఉపయోగించే గిడ్డంగులను నిర్వహించాలి. అలాగే త్వరగా చెడిపోయే కూరలు, పండ్లు, మాంసం మొ॥ వస్తువుల కోసం శీతలగిడ్డంగులు కూడా గ్రామ పంచాయితీలు నిర్వహించాలి.

పంపిణీ వ్యవస్థ నిర్వహణ మరియు అదుపు :

లోకవిద్యబజార్‌లో ఆ ప్రాంతంనుంచి వచ్చే వస్తువుల పరిమాణాన్ని బట్టి ఎంత పరిమాణాన్ని ఇతర బజార్లకు తరలించాలి అలాగే అవసరమైన మేరకు ఏవేవి దిగుమతి చేసుకోవాలో స్థానిక యాజమాన్య కమిటి ఆధ్వర్యంలో నిర్ణయం జరగాలి. వీరి ఆధ్వర్యంలోనే కావాల్సిన రవాణా, నిల్వ సౌకర్యాలు వుండాలి.

మిగులు పంపిణీ మరియు లోటు నిర్వహణ :

గిడ్డంగుల నిర్వహణ పద్ధతి ద్వారా అధికోత్పత్తులను ఇతర బజార్లకు పంపడమే కాకుండా స్థానిక అవసరాల మేరకు ఏ వస్తువూ కొరత లేకుండా దిగుమతి చేసుకోవడం కూడా లోకవిద్యాబజార్ నిర్వహిస్తుంది. అంటే లోకవిద్యాబజార్ స్థానిక అవసరాల మేరకు అందరికీ గౌరవప్రదమైన వేతనాలనందించే నిరంతర ఉపాధి కల్పించడమేకాక స్థానిక అధిక ఉత్పత్తులను ఎగుమతిచేస్తూ స్థానిక అవసరాలకు కొరతని ముందే గుర్తించి దిగుమతి చేసుకొనే, విదేశీ వ్యాపారాల విధానాలను నిర్ణయించడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. ఆ విధంగా లోకవిద్యాపంచాయితీలు మండల, జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా లోకవిద్య ఆధారంగా నిర్మితమౌతాయి.

**- డా॥ క్రిష్ణంరాజులు వ్యాసం ఆధారంగా**

# ప్రజల్ని నిర్వాసితులను చేసే అన్ని రకాల అభివృద్ధిని అడ్డుకోవటం నాగరికుల బాధ్యత

ప్రపంచవ్యాప్తంగా భూముల్ని ఆక్రమించి పరిశ్రమలకు కావల్సిన ముడి పదార్థాలను తమ దేశాలకు తరలించుకుపోవడానికి ఇంగ్లీష్, ఫ్రెంచి, పోర్చుగీస్, డచ్చి వారు రాజ్యాధికారానికి ప్రయత్నించి తద్వారా స్థానిక ప్రజల్ని వారి వ్యాపకాల నుండి, వారి భూముల్నుండి వెళ్ళగొట్టారు. ఈనాడు అభివృద్ధి కోసం పెద్ద రిజర్వాయర్లు, పెద్ద పరిశ్రమలు, వెడల్పాటి రోడ్లు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు అంతిమంగా గనులు మరియు ఇతర ఖనిజాల కోసం రైతుల్ని, ఆదివాసుల్ని వారి ప్రాంతంనుండి వెళ్ళగొట్టి భూసేకరణ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేయడం చూస్తున్నాం. దీంట్లో భాగంగానే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత వెనకబడిన సింగ్రోలి జిల్లా నిండా కొండలు, అడవులతోపాటు బొగ్గగనులు విస్తారంగా వున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు అభివృద్ధి పేరుతో ఇక్కడ బొగ్గగనుల తవ్వకాలతో పాటు పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించారు. దీనికోసం ఇచ్చటి ప్రజలు ప్రధానంగా ఆదివాసులను వారి భూముల్నుంచి వెళ్ళగొట్టడం జరిగింది. ఈ భూ నిర్వాసితులతో జూన్ 23, 24 తారీఖుల్లో లోకవిద్య జనాందోళన సభ్యులు ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తూ ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణం కోసం అభిప్రాయాన్ని సేకరిస్తూ పర్యటించారు. భారతదేశ చరిత్రలోనే ప్రజల్ని వారి ప్రాంతాల్నుంచి వెళ్ళగొట్టడానికి జూన్ 8, 1957 నాడే బొగ్గగనుల ప్రాంత భూసేకరణ చట్టాన్ని ప్రత్యేకంగా తీసుకొచ్చి మిగతా దేశ ప్రజలందర్ని సమీకరించి చట్టం చేయడం జరిగింది. విశాలభారత దేశంలో జరగబోయే అభివృద్ధి వల్ల తమకు బొగ్గ మరియు విద్యుత్ వస్తాయని ఆశించిన జనం భవిష్యత్‌లో తమ భూమి పోగొట్టుకుంటామనే భయం, ముందుచూపు లేకపోవడంతో ఆ చట్టానికి మద్దతు పలికారు. కొద్దిమంది స్థానికులు, ప్రతీ బొగ్గగని ప్రాంతంలో కొద్దిగా ఉద్యమాలు చేసినా అంతిమంగా ఆ ఉద్యమాలన్నీ తమకు మరింత ఆర్థిక ప్యాకేజీ కావాలనే ఏకసూత్రానికి పరిమితం చేయబడింది.

ఈనాడు దేశ వ్యాపితంగా లోకవిద్య జనాందోళన మరియు అటువంటి సంస్థలు విస్తృత ప్రచారంతో తమ దైనందిన జీవితంలోని వడిదుడుకులను చూడడం, నిర్వాసితుల దుర్భర పరిస్థితులు చూసిన ప్రజలందరూ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను కోరుతూ సింగ్రోలి ప్రాంత ప్రజలు ప్రధానంగా ఈ క్రింది డిమాండ్లను ముందుపెట్టారు.

1. స్థానిక ప్రజల వల్ల స్థానిక మానవ వనరుల పెట్టుబడితో జాతీయ స్థూల పెట్టుబడులతో ఉత్పత్తిలో 60 శాతం ఈ ప్రజలు సృష్టిస్తున్నారు. కానీ అత్యధిక 15 శాతం మాత్రమే జాతీయ స్థూల ఉత్పత్తిలో అతికొద్ది ఉద్యోగాలు సృష్టించే ఈ పారిశ్రామిక వేత్తలకు మద్దతు పలకడం తప్పు.
2. ఈ పట్టణాభివృద్ధి కేంద్రీకృత అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల మీద జ్ఞానం పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెడుతుండగా సామాన్య ప్రజలకుపయోగపడే లోకవిద్యకోసం ప్రభుత్వాలు ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదు.
3. నేటి విద్యాధికులు కాలేజీల నుండి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగం కావాలని లక్షలాది కోట్ల పెట్టుబడులు పెట్టి కొద్దిమందికి ఉద్యోగాలు కల్పించే అభివృద్ధి నమూనా బదులు లోకవిద్య మీద ఆధారపడి స్థానిక వనరులతో స్థానికంగా జీవించే ప్రజలకోసం ప్రభుత్వాలు ఖర్చుపెట్టేదేమి లేకపోయినా పన్నుల రూపేణా వనరులు సేకరించుకు వెళుతున్నారు.
4. స్థానిక వనరులతో, ఎటువంటి ఉత్పత్తి చేయలేని సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్న ఈ విశ్వవిద్యాలయాల నుండి వచ్చే విద్యాధికుల కోసం వారి ఉపాధికోసం భారతప్రధాని 'మేక్ ఇన్ ఇండియా' భారత్‌లో ఉత్పత్తి చెయ్యండి అనే పేరుతో విదేశీ పెట్టుబడులు ఆహ్వానిస్తూ స్థానికంగా ఏ పనికి పనికిరాని ఈ విద్యాధికుల 'నైపుణాల్య అభివృద్ధి కార్యక్రమం' పేరుతో ప్రధానమంత్రి మరింతగా ఈ విద్యాధికులకు మాత్రమే మద్దతు ఇవ్వడం అన్యాయం.
5. పెద్ద చదువులు చదువుకుని ఉద్యోగం కోసం పెద్ద పెట్టుబడి దారుల మీద, ప్రభుత్వం మీద ఆధారపడే నూతన విద్యాధరుల కోసం తమ జ్ఞానంతో, తమస్థానిక వనరులతో తమ కాళ్ళమీద తాము నిలబడుతున్నటువంటి స్థానికులను వారి ప్రాంతంనుండి వెళ్ళగొట్టడం అన్యాయం, అక్రమం, అనైతికం
6. 1990 నుండి ప్రవేశపెట్టబడిన నూతన ఉత్పత్తి, వినియోగ, ఎగుమతి, దిగుమతులపై ఆధారపడిన పక్కా లాభాపేక్షతో ముడిపడిన, మానవ సంబంధాలు కొరవడిన నూతన ఆర్థిక విధానాలు తిరస్కరించాలి.
7. మన రాజ్యాంగంలో బ్రతికే హక్కుతోపాటు స్థానిక వనరులతో స్థానికంగా జీవించే హక్కు వుండాలి.
8. ఇంజనీరింగ్ చదివిన వారు, వైద్యం విద్య చదివిన వారు వారి రంగంలో తప్ప మిగతారంగాలలో ఎందుకు కొరగాని వారు. అలాగే రైతులు, చేతి వృత్తులవారు, తోపుడుబండ్లవారు, చిరు దుకాణాదారులు మరో రంగంలో ఇమడలేరు. ఈ 80శాతం మందిని నిర్వాసితులను చేసి 20 శాతం మందికి మేలుచేసే ఈ అభివృద్ధి విధానాన్ని తిరస్కరించాలి.
9. లోకవిద్యతో చేసిన ఉత్పత్తి దారుడు తెలుసుకునే వీలు, తద్వారా అనుభవించే ఆనందం నూతన అభివృద్ధిపథంలో ఏ వస్తువు ఒక మనిషి తయారు చేయకపోవడం మూలానా శూన్యంగా మిగుల్తుంది.
10. లక్షలాది ఎకరాలలో ఉన్న అడవులను నరికి, ఖనిజాల వెలికితీత వలన పర్యావరణం ప్రమాదంలో పడుతోంది.
11. మనం సృష్టించని దాన్ని మనకు నాశనం చేసే హక్కులేదు.
12. గన్నులించి తీసిన వ్యర్ధ పదార్థాలతో ఏర్పడుతున్న నూతన కొండలవల్ల పర్యావరణానికి జరిగే హాని విలువ ఎవరికి తెలియదు.
13. వినియోగిస్తున్న భూమిపై హక్కు కొద్దిమందికోసం రద్దుచేయడం అధర్మం, ప్రకృతి విరుద్ధం
14. నేటి భూసేకరణచట్టంలో మనిషిని మనిషిగా కాక ఒక ముడిపదార్థంగా చూడడం ప్రకృతి విరుద్ధం.
15. ప్రకృతిని, మానవుడిని హింసించి, నాశనం చేసే విధానాన్ని అభివృద్ధి అని పిలవడం శుద్ధ తప్పు
16. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు చెట్లను రక్షించమని బొగ్గద్వారా విద్యుత్ ఉత్పత్తి మానమని ప్రకృతిని రక్షించమని ఘోషిస్తోంటే మన ప్రభుత్వం వీటికి వ్యతిరేకంగా పనిచేయడం క్షంతవ్యం కాదు.
17. గాలిమరలు, సూర్యరశ్మి ద్వారా వచ్చే విద్యుత్ వాడకాలను మరే ఇతర పద్ధతిలోనైనా విద్యుత్ ఆదాను ప్రోత్సహించమని మనదేశంలోని శాస్త్రజ్ఞులు చెప్తున్న అభివృద్ధి నమూనాను పాటించకపోవడం సరికాదు.
18. భారతదేశపు బొగ్గు నాణ్యతలేనిది. ప్రజలను నిర్వాసితులను చేసే బదులు నాణ్యత కల్గిన బొగ్గును దిగుమతి చేసుకోవచ్చు.
19. ఎన్నుకోబడిన స్థానిక శాసన సభ్యుడు, పార్లమెంటు సభ్యుడు ప్రజలతో నిర్వాసితుల సమస్యలను చర్చించకపోవడం అప్రజాస్వామికం.
20. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల్నే నిర్వాసితులను చేసే ఈ అభివృద్ధి నమూనా ప్రజాస్వామ్య బద్ధంకాదని దీనిని తిరస్కరించడానికి కమిటీలను స్థానికంగా నిర్మించి, ఇటువంటి ఉద్యమాలతో కలిసి దేశవ్యాప్తంగా మహోద్యమ నిర్మాణం జరగాలని తీర్మానించడం జరిగింది.

**- డా॥ లలిత్‌కౌల్**

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

**మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన**
**వెబ్ పేజీ** : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు కాపీల కోసం పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**15 AUGUST - 2016**

**To**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**